సాక్షి
వికారాబాద్
బుధవారం । 21 । జూన్ । 2023




భోజనంలో వెజ్ బిర్యానీ

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం మరింత బలవర్ధకంగా మారనుంది. 8లో▸



నోట్ బుక్స్ సైతం ఉచితం

గ్రామీణ పేద విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరో కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 8లో▸



గతుకుల రోడ్డు..

అసలే గతుకుల రోడ్లు.. ఆపై కాలం చెల్లిన బస్సులలో ప్రయాణంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. 9లో▸

పట్నం వైపు వెళ్లేదెవరు?



చేతులెత్తేసిన మంత్రి, ఎంపీ

మహేందర్‌రెడ్డి అనుచరులపై బీఆర్‌ఎస్ నజర్

- రంగంలోకి దిగిన బడా నేతలు
- పార్టీకి నష్టం కలగకుండా చర్యలు
- జిల్లాలోని ద్వితీయ శ్రేణి నాయకులతో మంతనాలు

వికారాబాద్: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో పార్టీ పెద్దలు నష్ట నివారణ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా పట్నం అనుచరగణంపై ఫోకస్ పెట్టారు. ఒకవేళ ఆయన పార్టీ నుంచి బయటకు వెళ్తే అతనితో నడిచేదెవరు..? బీఆర్‌ఎస్‌లో కొనసాగేదెవరు..? అనే విషయంపై దృష్టిసారించారు. మహేందర్‌రెడ్డి అనుచరులతో పాటు జిల్లాలోని స్థానిక ఎమ్మెల్యేలపై అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ మేరకు సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు, పార్టీలోని ఇతర ముఖ్య నేతలు రంగంలోకి దిగి బుజ్జగింపుల పర్వానికి తెరతీసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పట్నం ఎటువైపు వెళ్లినా ఆయన బాటలో నడిచేందుకు చాలామంది మద్దతుదారులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో పొసగక పట్నంతో జట్టు కట్టాము కానీ.. పార్టీ వీడే పరిస్థితి ఏర్పడితే తాము గులాబీ జెండా నీడలోనే ఉంటామని మరికొంతమంది చెబుతున్నారు.

చేతులెత్తేసిన మంత్రి, ఎంపీ

ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎక్కడ చూసినా పట్నం పయనమెటు..? అనే విషయం పైనే ప్రధాన చర్చ జరుగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మహేందర్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా మంచి పట్టుంది. ఆయన కాంగ్రెస్‌లోకి వెళితే పలువురు కీలక నేతలు సైతం ఆయన బాటలోనే నడుస్తారని అధిష్టానానికి సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్... ప్రతిపక్ష కాంగ్రెస్ నువ్వా.. నేనా అనే తరహాలో పోటీ పడుతుండగా పట్నం వెళ్లిపోతే నష్టం తప్పదని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. ఇదే జరిగితే రాష్ట్ర రాజధానికి అనుకుని ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్‌కు బలం పెరిగి.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావం చూపుతుందని అధికార పార్టీ అంచనా వేస్తోంది. పలు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇప్పటికే రెండు వర్గాలుగా విడిపోయాయి. చాన్నాళ్లుగా పార్టీ కార్యక్రమాలను సైతం ఇరువర్గాలు వేర్వేరుగా నిర్వహిస్తున్నాయి. వీరిని ఒక్కతాటిపైకి తెచ్చే విషయంలో జిల్లా మంత్రి, ఎంపీ సహా ముఖ్యనేతలందరూ ఎప్పుడో చేతులెత్తేశారు. ఇక ఈ వ్యవహారంలో ఏమాత్రం ఆలస్యం చేయకూడదని పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఫోన్లు చేసి బుజ్జగింపు

అసంతృప్త నాయకులను బుజ్జగించేందుకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్సీ నవీన్‌రావ్, మంత్రి హరీశ్‌రావ్ తదితర ముఖ్య నేతలు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. నయానో... భయానో వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. మూడు రోజులుగా ఈ తతంగం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నతో కలిసి వెళితే ఎలా నిలువరించాలనే వ్యూహంలో భాగంగానే ముందుగానే అతని భవిష్యత్తుపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో.. తాను ఎట్టిపరిస్థితిలోనూ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అంతటితో ఆగకుండా మరో అడుగు ముందుకేసి అతనిపై వేసిన కోర్టు రెఫరల్ కేసు విషయంలోనూ కొందరు పార్టీ పెద్దల ప్రమేయం ఉండే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక ఇటీవల మాజీ ఎమ్మెల్యే కేస్ రత్నం, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి తదితరులను సైతం రప్పించుకుని, ఫోన్లు చేసి బుజ్జగిస్తున్నట్లు వినికిడి. మహేందర్‌రెడ్డితో సైతం కేటీఆర్ చర్చించినట్లు తెలుస్తోంది. తన భవిష్యత్తు, వికారాబాద్, తాండూరు, చేవెళ్ల ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు విషయంలో తనకు స్పష్టమైన హామీ ఇస్తేనే పార్టీలో కొనసాగుతానని పట్నం చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

కొడంగల్ నుంచే రేవంత్ పోటీ



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి
- గురునాథ్‌రెడ్డి చేరికపై పార్టీ శ్రేణుల అభిప్రాయ సేకరణ

కొడంగల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచే పోటీ చేస్తారని ఆయన సోదరుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరే అంశంపై కార్యకర్తలతో చర్చించారు. వారి అభిప్రాయాలను విన్నారు. పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్ మాట్లాడుతూ.. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి కాకుండా మరెవరికి టికెట్ ఇచ్చినా రాజకీయంగా అదే తనకు చివరి రోజన్నారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ మాట్లాడుతూ..తన తాత, చిన్నాయన ఎమ్మెల్యేలుగా పని చేశారని గుర్తు చేశారు. కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డిని పోటీ చేయించి, ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. గురునాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని చెప్పారు. గాంధీభవన్‌కు వచ్చి కండువా కప్పుకోవడమే మిగిలిందని తెలిపారు. 2009లో రేవంత్ గెలిచిన తర్వాత ఈ ప్రాంత ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. గ్రామాల్లో కొంత మేర సమస్యలు ఎదురైనా సర్దుకు పోవాలని శ్రేణులకు సూచించారు. రేవంత్‌రెడ్డి గెలిచిన తర్వాత కార్యకర్తలను ఆదుకుంటామని ప్రకటించారు. కొడంగల్‌ను దత్తత తీసుకున్న కేటీఆర్ ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఓటమే లక్ష్యంగా కలిసి కట్టుగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురునాథ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వస్తే తమకెలాంటి అభ్యంతరం లేదని కార్యకర్తలు, నాయకులు తీర్మానం చేశారు. తమకు ఇవ్వాల్సిన గౌరవం, మర్యాద ఇస్తే చాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్, ఇందనూర్ సర్పంచ్ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, ఆనంద్‌రెడ్డి, సోమ శేఖర్, దత్తు, ధాము, బాల్‌రాజ్, మైనార్టీ నాయకులు నయీం, ఆసిఫ్‌ఖాన్, ముస్తాక్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఎమ్మెల్యే ఆనంద్ అభినందన



విద్యార్థులు, ప్రిన్సిపల్, సిబ్బందితో ఎమ్మెల్యే

అనంతగిరి: నీట్ ఫలితాల్లో సత్తాచాటిన వికారాబాద్ పట్టణం కొత్తగడి బాలికల రెసిడెన్షియల్‌కు చెందిన నలుగురు విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అభినందించారు. మంగళవారం వారిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అపర్ణ ఉన్నారు.

ఉత్తమ హెచ్‌ఎం వీరేశంకు సన్మానం



కలెక్టర్ నారాయణరెడ్డితో వీరేశం

యాలాల: విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయులను సన్మానించారు. ఇందులో భాగంగా రాస్నం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాజుల వీరేశంను బెస్ట్ హెచ్‌ఎంగా ఎంపికయ్యారు. కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈఓ రేణుకాదేవి, ఎమ్మెల్యే ఆనంద్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ తదితరులు వీరేశంను ఘనంగా సన్మానించారు.

'ఆరోగ్య మహిళ' సేవలపై ఆరా



ఆరోగ్య మహిళా కేంద్రంలో డీఎంహెచ్‌ఓ

వికారాబాద్ అర్బన్: ఆరోగ్య మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్ అన్నారు. రామయ్యగూడ పీహెచ్‌సీ పరిధిలోని సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఇక్కడ అందుతున్న సేవలపై మహిళలను అడిగి ఆరా తీశారు. ఆయన వెంట ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జీవరాజ్, డాక్టర్ అరవింద్, డాక్టర్ మానస, డాక్టర్ నిఖిల్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా యాదయ్య



సన్మానం పొందిన యాదయ్య

కుల్కచర్ల: చౌడాపూర్ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ పుట్టా యాదయ్య జిల్లా ఉత్తమ చైర్మన్‌గా ఎంపికయ్యారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈఓ రేణుకాదేవి చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. ఎంఈఓ హబీబ్ అహ్మద్, స్కూల్ హెచ్‌ఎం తిమ్మ్య హర్షం వ్యక్తంచేశారు.

రేపు కొండకల్‌కు సీఎం కేసీఆర్ రాక!

శంకర్‌పల్లి: కొండకల్‌లోని రైల్, మెట్రోకోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 22న రానున్నట్టు సమాచారం. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో 200 పడకల మల్టీ స్పెషాలటీ ఆస్పత్రికి ఉదయం 11గంటలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం రామచంద్రాపురం మండలం కొల్లూరు, వెలిమెల గ్రామాల్లో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి మండలంలోని కొండకల్ గ్రామానికి విచ్చేయనున్నారు. ఏ సమయానికి వస్తారనేది ఇంకా షెడ్యూల్ ఖరారు కాలేదు. ముఖ్యమంత్రి జిల్లాకు వస్తుండటంతో అధికారులు, పోలీసులు అలర్ట్ అయ్యారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. 2018లో కొండకల్ గ్రామంలోని సర్వే నంబర్ 310లో గల 100 ఎకరాల్లో రూ. 800కోట్ల నిధులతో రైల్, మెట్రో కోచ్ ఫ్యాక్టరీ స్థాపించిన సంగతి తెలిసిందే.

వసతులు ఆధునికం..

రక్షణ అధమం



పగిడియాల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రూ.3 లక్షల విలువైన ప్యానెల్ బోర్డు

- ప్రభుత్వ పాఠశాలల్లో రూ.లక్షల విలువైన సామగ్రి
- డిజిటల్ తరగతుల బోధనకు అధునాతన పరికరాలు
- వాచ్‌మన్లు లేక ఉపాధ్యాయుల్లో టెన్షన్

యాలాల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక,మెరుగైన బోధన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందజేసిన సామగ్రి రక్షణ.. గాలిలో దీపంలా మారింది. డిజిటల్ క్లాసుల నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు రూ.లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ పరికరాలను పంపిణీ చేసింది. కానీ వీటి భద్రతపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

'మన బడి'లో అభివృద్ధి పనులు

మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఆరు ఉన్నత పాఠశాలలతో పాటు పలు ప్రాథమిక పాఠశాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో పగిడియాల, కోకట్, యాలాల, జుంటుపల్లి, అగ్గనూరు, బెన్నూరు పాఠశాలల్లో హైస్కూల్ విద్యార్థులకు డిజిటల్ క్లాసుల నిర్వాహణకు భారీగా అధునాతన పరికరాలను పంపిణీ చేశారు. వీటిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు(ఐఎఫ్‌పీబీ)లు బహిరంగ మార్కెట్‌లో ఒక్కదానికి సుమారు రూ.3 లక్షల పైచిలుకు ధర ఉన్నాయి. ప్యానెల్ బోర్డుతో పాటు ఆధునిక వసతుల కలిగిన డ్యుయల్ డెస్క్ టేబుళ్లు, గ్రీన్ బోర్డు, ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేశారు.ఇలా ఒక్కో పాఠశాలకు సుమారు రూ.10లక్షల విలువైన పరికరాలను అందించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికి వీటిని భద్రపరిచే విషయంలో ఆందోళన నెలకొంది.

వాచ్‌మెన్‌లను కేటాయించాలి..

మండల పరిధిలోని చాలా స్కూళ్లను తక్కువ ఎత్తున్న ప్రహరీలు, విరిగిన గేట్లు వెక్కిరిస్తున్నాయి. భద్రత పరంగా సౌకర్యాలతో పాటు ఒక్క పాఠశాలకు నిరంతర నిఘాకు వాచ్‌మెన్ లేదు. మండలంలోని 10 హైస్కూళ్లతో పాటు 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. కాగా ఈ ఏడాది వేసవి సెలవుల్లో నెల రోజుల పాటు మన ఊరు- మన బడి పథకంలో భాగంగా వాచ్‌మన్ల ఏర్పాటుకు నెల వేతనాన్ని ఇచ్చేందుకు అంగీకరించారు. నిరంతరం దీన్ని కొనసాగిస్తే బాగుంటుందని టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ.15 లక్షల సామగ్రి ఉంది



పగిడియాల పాఠశాలకు రూ.15 లక్షల విలువైన బోధన సామగ్రి అందించారు. పోటీ వాతావరణానికి అనుగుణంగా బోధించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ, పాఠశాలలకు వాచ్‌మెన్లను కేటాయించకపోవడం దురదృష్టకరం.

– నర్సింహులుగౌడ్, ఉప సర్పంచ్, పగిడియాల

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలోని సుమారు ఆరు పాఠశాలల్లో రూ.లక్షల విలువైన ఆధునిక బోధన సామగ్రి ఉంది. వీటి భద్రత విషయంలో ఆందోళన ఉన్న మాట వాస్తవం. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ

ఇష్టారాజ్యంగా రోడ్డు విస్తరణ

- బీఆర్‌ఎస్ నేతల నిర్మాణాలు, ఆస్తులను కాపాడుకుంటున్నారు
- వంద ఫీట్ల రోడ్డును 85 ఫీట్లకే కుదిస్తున్నారు
- నేషనల్ హైవే అథారిటీకి ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న సదానందరెడ్డి తదితరులు

తాండూరు టౌన్: పట్టణం మీదుగా వెళ్తున్న నేషనల్ హైవే లింకు రోడ్డు విస్తరణ పనులు అడ్డదిడ్డంగా కొనసాగుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. మంగళవారం పలువురు నాయకులతో కలిసి ఎన్‌హెచ్ 167 రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతో బూత్పూర్ నుంచి కర్ణాటకలోని మన్నెకెల్లి వరకు నేషనల్ హైవే పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తాండూరు పట్టణం గుండా హైవేకు కలిపే లింక్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రోడ్డు విస్తరణకు వంద ఫీట్ల వరకు ఉండాలని హైవే అధికారులు నిర్ణయించగా.. కేవలం 85 ఫీట్లు మాత్రమే విస్తరణ జరుగుతోందన్నారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు భవనాలను కూల్చేయకుండా ఆయా ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా 85 ఫీట్ల మేరకు మాత్రమే విస్తరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులపై తాండూరు ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, రోడ్డు కాంట్రాక్టరు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. గతంలో నిర్మించిన రోడ్డు డివైడర్‌పైనే సిమెంటు పూత పూసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అధికార పార్టీ నాయకుల ఆస్తులను కాపాడేందుకే రోడ్డు ఇరుకుగా నిర్మిస్తున్నారన్నారు. అక్రమాలపై నేషనల్ హైవే అథారిటీ అధికారుల ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను తామే తెచ్చినట్లు బీఆర్‌ఎస్ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఈనెల 22న తాండూరుకు రానున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్తామని తెలిపారు. వీరివెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంతారం లలిత, కౌన్సిలర్ సాహు శ్రీలత, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఆవులు, దూడలను తరలించొద్దు

- ఇతర పశువులను తరలించే వారు నిబంధనలు పాటించాలి
- ఫిట్ ఫర్ స్లాటర్, రవాణా పత్రాలు తప్పనిసరి
- అధికారుల సమావేశంలో ఎస్పీ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: బక్రీద్ సందర్భంగా ఆవులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఈమేరకు తన కార్యాలయంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎట్టి పరిస్థితిలోనూ ఆవులు, లేగ దూడలను తరలించొద్దన్నారు. ఇతర పశువులను తీసుకెళ్లే వారు ఫిట్ ఫర్ స్లాటర్ పత్రాలు, పశువును తరలిస్తున్న వాహనాల పత్రాలు తప్పనిసరిగా వెంట పెట్టుకోవాలని తెలిపారు. వాహనంలో ఒక్కో పశువు మధ్య రెండు స్క్వేర్ మీటర్ల స్థలం ఉండాలన్నారు. వాహనాల్లో పరిమితికి మించి, ఎక్కువ సంఖ్యలో తరలించకూడదని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోతే అక్రమ రవాణాగా పరిగణించి పశువులను గోశాలలకు తరలిస్తామని తెలిపారు.

పది చెక్ పోస్టులు

పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పది చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పశువులు కలిగిన వాహనాలను అనధికారికంగా అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు డీటీసీ అడిషనల్ ఎస్పీ మురళీధర్, జిల్లా వెటర్నరీ అధికారి అనిల్ కుమార్ జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వికారాబాద్, పరిగి, తాండూరు అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు తల్లులకు భరోసా ఇవ్వండి



ఒకే కాన్పులో పుట్టిన ముగ్గురు ఆడ పిల్లలు

- ఒకే కాన్పులో ముగ్గురు ఆడ పిల్లలు
- నిలోఫర్ ఆస్పత్రిలో తల్లీబిడ్డలు క్షేమం

తాండూరు రూరల్: ఒకే కాన్పులో ముగ్గురు ఆడపిల్లలు జన్మించగా అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు మండలం కోటబాసుపల్లిలోని వడ్డెరగల్లికి చెందిన వడ్డె నవీన్, లక్ష్మి దంపతులు. వీరికి మూడేళ్ల క్రితం వివాహం జరగగా గతేడాది ఒక పాప, బాబు పుట్టి చనిపోయారు. గత బుధవారం లక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు నిలోఫర్‌కు తీసుకెళ్లారు. గురువారం ఆమె ముగ్గురు ఆడ పిల్లలకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. దంపతులిద్దరూ తాండూరులోని నాపరాతి గనిలో కూలీ పనులు చేసి జీవనం సాగిస్తారు. ఒకే కాన్పులో ముగ్గురు ఆడపిల్లలు పుట్టిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

11 ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్‌చేసిన ట్రాక్టర్లతో ఎస్‌ఐ

యాలాల: కోకట్ కాగ్నా నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లను యాలాల పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుక రవాణాకు రెవెన్యూ నుంచి అనుమతులు పొందినా నిర్ణయించిన సమయం కంటే ముందే నదిలో ఇసుకను లోడ్ చేస్తున్నారు. గమనించిన పోలీసులు 11 ట్రాక్టర్లను స్వాధీనంచేసుకుని పీఎస్‌కు తరలించారు. తహసీల్దార్ ఎదుట ట్రాక్టర్ల యజమానులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

బొగ్గు లారీ పట్టివేత



స్వాధీనం చేసుకున్న లారీ

బషీరాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా బొగ్గు వేస్టేజీతో వెళ్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్‌ను విచారిస్తే కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ నుంచి బొగ్గు వేస్టేజీని జీవన్గీకి ఇటుకల బట్టీ కోసం తీసుకు వస్తున్నట్లు తెలిపారు. అయితే వారి దగ్గర ఎలాంటి వే బిల్స్ లేకపోవడంతో తహసీల్దార్ వెంకటస్వామికి మంగళవారం సరెండర్ చేశారు. తహసీల్దార్ రూ.5 వేల జరిమానా వేసి వదిలిపెట్టినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

తల్లి మందలించిందని..

ఇంటి నుంచి వెళ్లిన యువకుడు



నవీన్ (ఫైల్)

ధారూరు: తల్లి మందలించిందని ఓ యువకుడు ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరుకు చెందిన గుర్రం నవీన్ (19)ని తల్లి నర్సమ్మ ఈనెల 15న రాత్రి పని విషయంలో కొడుకును మందలించింది. 16న ఉదయం ఇంట్లోంచి వెళ్లిన నవీన్ తిరిగి రాలేదు. బంధువుల వద్ద, సమీప గ్రామాల్లో వెతికినా ఆచూకి లభించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నవీన్ ఒంటిపై ఆకుపచ్చ చొక్క, జీన్స్ పాయింట్ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రూ.లక్ష సాయం దరఖాస్తు గడువును పెంచాలి

మర్పల్లి: బీసీ కులవృత్తులకు అందించే రూ.లక్ష సహాయం దరఖాస్తు గడువును పక్షం రోజులు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాయింట్ కన్వీనర్ ఈశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై నగరంలోని విద్యానగర్ కాలనీలో ఏపీ వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యను కలిశారు. ఈ సందర్భంగా బీసీ కులవృత్తులకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం కోసం కుల, ఆదాయం సర్టిఫికెట్లు అందక చాలా మంది దరఖాస్తు చేసుకోలేక పోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి గడువు పెంచేందుకు కృషి చేయాలని ఆయన ఆర్. కృష్ణయ్యను కోరారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర

షాద్‌నగర్: పూరీ జగన్నాథ స్వామి రథయాత్రను మంగళవారం షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కొలువుదీరిన జగన్నాథ స్వామి ఆలయం నుంచి రథయాత్రను ప్రారంభించారు. మెయిన్ రోడ్డు మీదుగా ఫరూఖ్‌నగర్ వరకు యాత్ర సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, నాయకులు విశ్వం, సాయికృష్ణ, భిక్షపతి, సుధీర్, వెంకట్‌రామ్‌రెడ్డి, రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్న భోజనం’లో వెజ్ బిర్యానీ



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

మెనూలో బిర్యానీ, కిచిడి
- విద్యార్థులకు మరింత పౌష్టికాహారం
- కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం విద్యార్థులకు మరింత బలవర్థకంగా అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే వారంలో మూడు రోజులు ఉడికించిన గుడ్డు ఇస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థులకు రెండేళ్లుగా సన్నబియ్యంతో కూడిన భోజనం అందిస్తున్నారు. అయినప్పటికీ మరింత పోషకాలతో కూడిన ఆహారం అందించాలనే ఉద్దేశంతో మెనూలో మార్పులు చేసింది. ప్రస్తుతం ఇస్తున్న ఆహారంతో పాటు వారంలో ఒకరోజు వెజ్ బిర్యానీ, ఒక రోజు కిచిడి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖకు ఆదేశాలు సైతం జారీ చేసింది. ఈ ఏడాది పాఠశాలలు తెరిచిననాటి నుంచి కొత్త మెనూ అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ డీఈఓలను ఆదేశించింది. ప్రస్తుతం ప్రాథమిక స్థాయిలో ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజనం వండి పెడుతునందుకు రూ.5.45, హైస్కూల్ స్థాయిలో రూ.8.17 చొప్పున కూరగాయలు ఖర్చుల కింద చెల్లిస్తున్నారు.

92 వేల మందికి మేలు

జిల్లాలో 1053 పాఠశాలల్లో 92వేల మంది విద్యార్థులు విద్యనుఅభ్యసిస్తున్నారు. రోజు వీరందరికి సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కొత్త మెనూ అమలు చేయడంతో విద్యార్థులకు మరింత పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందనుంది. ఇది విద్యార్థుల మానసిక, శారీక ఆరోగ్య ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

నష్ట పోతామంటున్న ఏజెన్సీలు

కొత్త మెనూ విద్యార్థులకు ఎంతో మేలు చేయనున్నప్పటికీ సంబంధిత ఏజెన్సీలకు మాత్రం నష్టం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జాతీయ పోషకాహార సంస్థ కొత్త మెనూ ప్రకారం కూరగాయలు, వంట నూనె, కారం, ఉప్పు వంటి వస్తువుల కొనుగోలుకు డబ్బులు పెంచాలని మాత్రం చూపించలేదు. పాత ధరలకే కొత్త భోజనం వడ్డించాల్సి రావడంతో పాటు, ఎజెన్సీల గౌరవ వేతనంలో కూడా మార్పులు లేక పోవడంతో నష్టం జరుగుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో తమపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు భారంపై ఉన్నతాధికారులు ఆలోచించాలని ఎజెన్సీ సభ్యులు కోరుతున్నారు. పైగా గత విద్యా సంవత్సరానికి చెందిన పెడింగ్ బిల్లులు కూడా రాలేదని చెబుతున్నారు. పాత బిల్లులు ఇవ్వక పోగా కొత్త మెనూ అమలు తమకు భారంగా మారుతుందని అంటున్నారు.

ఇది మెనూ

కొత్త మెనూ ప్రకారం సోమవారం కిచిడి, మిక్స్‌డ్ విజిటబుల్ కూర, కోడిగుడ్డు ఇవ్వాలి. మంగళవారం అన్నం, సాంబారు, కిచిడి, ఏదైనా కూరగాయలతో కూడా, బుధవారం అన్నం, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ విజిటబుల్ కూర, కోడిగుడ్డ, గురువారం విజిటబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ విజిటబుల్ కూర, శుక్రవారం అన్నం, సాంబారు, మిక్స్‌డ్ విజిటబుల్ కూర, కోడి గుడ్డు ఇవ్వాలి.



విద్యుత్ దీపాల వెలుగుల్లో అనంతగిరి ఆలయం

‘అనంత’ముస్తాబు

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ధార్మిక దినోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అనంతగిరి గుట్ట అనంతపద్మనాభ స్వామి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఆలయం అంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. - అనంతగిరి

జొన్నలు కొనుగోలు చేయండి



మన్నెగూడ వద్ద రైతుల ఆందోళన

పూడూరు: చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం జొన్నలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మన్నెగూడ వద్ద ఉన్న హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన జొన్న పంట అకాల వర్షాలకు నల్లబారడంతో కొనుగోలు చేయడంలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నల్లబారిన జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే.. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన చేయడంతో మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు జైపాల్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వీరేశం, నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెలు వచ్చేశాయ్



పెద్దేముల్ మండలానికి వచ్చిన రెండో విడత గొర్రెలు



మృత్యు వాత పడిన గొర్రెను చూపిస్తున్న లబ్ధిదారుడు గోపాల్

పంపిణీ కాకముందే చనిపోయిన గొర్రె

పెద్దేముల్: రెండో విడత సబ్సిడీ గొర్రెలు మంగళవారం మండలానికి చేరుకున్నాయి. గొల్ల కురుమలకు పంపిణీ చేయకుముందే ఒకటి మృత్యువాతపడింది. జీవాలు తెచ్చేందుకు కనీసం సంబంధిత అధికారులు కూడా సహకరించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో పలు గ్రామాల గొల్ల కురుమలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దేముల్ మండలానికి మొదటి విడతలో 405 యూనిట్లకు గొర్రెలు వచ్చాయి. రెండో విడత కింద 407 యూనిట్లు లబ్ధిదారులకు గొర్రెలు మంజురైనట్లు పశువైద్యాధికారుల ద్వారా తెలుస్తోంది. గొర్రెలు పంపిణీ కాక ముందే మృత్యు వాతపడటంతో వాటి బాధ్యులు ఎవరని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గొర్రెలు తీసుకువచ్చే సమయంలో పశువైద్యులు లబ్ధిదారుల వెనక ఉండి గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా? లేదా? అనే విషయాలు పరిశీలించకపోవడంతో వాటిని తీసుకువచ్చిన రోజే ఒక గొర్రె మృత్యువాత పడింది. ఇంకా కొన్ని గొర్రెలు అనారోగ్యంతో ఉన్నాయి. వాటిని చూసి లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి మృత్యువాత పడిన గొర్రెలకు బదులు మరో కొత్త గొర్రెలను అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పరిహారం అందించాలి

అధికారులు తనకు ఇంకా అధికారికంగా గొర్రెలను పంపిణీ చేయకముందే ఒక గొర్రె మృత్యువాత పడింది. మరో గొర్రె కూడా అనారోగ్యంగా ఉంది. తమకు ప్రభుత్వం నుంచి గొర్రెలు ఇచ్చారనే సంతోషం లేకుండా పోయింది. మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలి.

– గోపాల్, జనగాం

సర్కారు బడుల బలోపేతమే లక్ష్యం

కార్పొరేట్ స్థాయిలో విద్య, మౌలిక వసతులు
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



అంతారం ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: ప్రభుత్వ బడులను బలోపేతం చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్, చౌడాపూర్, అంతారం గ్రామాలలో మన ఊరు – మనబడి కార్యక్రమం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో ముందుకుసాగుతున్నామన్నారు. గ్రామీణ బడులను బలోపేతం చేయాలని నిర్ణయించి మనబడి పథకం ద్వారా అధిక మొత్తంలో నిధులు కేటాయించి పాఠశాలల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తోందని అన్నారు. అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్‌లో మహిళల నిరసన

చౌడాపూర్‌లో ఎలాంటి మౌలిక వసతులు లేవని, కనీసం మంచినీరు కూడా సరిగ్గా సరఫరా కావడంలేదని మహిళలు ఆందోళనకు దిగారు. మరి కొంతమంది మహిళలు తమకు దళితబంధు ఎందుకు ఇవ్వలేదని కొందరికి మాత్రమే ఇవ్వడమేమిటని ప్రశ్నిస్తూ జెడ్పీ పాఠశాల గేటు దగ్గర నిరసన చేపట్టారు. కొందరు బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేస్తున్న మహిళలను పాఠశాల గేటు వద్ద అడ్డుకోవడంతో కొద్దిసేపుఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మహిళల ఆందోళన నేపథ్యంలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి చౌడాపూర్ పాఠశాల పరిధిలో విద్యాదినోత్సవాన్ని నామమాత్రంగా పూర్తిచేసి వెళ్లిపోయారు. చౌడాపూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి సైతం ఎమ్మెల్యే కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. మనోహర్ రెడ్డి వర్గంగా పేర్కొంటున్న మరికొందరు కూడా ఎమ్మెల్యే కార్యక్రమానికి దూరంగా ఉన్నట్లు సమాచారం.



చౌడాపూర్‌లో నిరసన చేపడుతున్న మహిళలను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



కుండీల్లో కానరాని మొక్కలు

మొక్కలపై శ్రద్ధేది?

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి వరకు సుమారు రూ.5లక్షలు ఖర్చు చేసి గత ఏడాది మొక్కలు నాటారు. పెద్ద ఎత్తున కుండీలను కూడా ఏర్పాటు చేశారు. ప్రారంభంలో వాటి రక్షణకు ఎంతో శ్రద్ధ చూపిన మున్సిపల్ సిబ్బంది ఇప్పుడు పట్టించుకోవడం లేదు. కనీసం వారంలో ఒకటి రెండు సార్లు కూడా నీరు పోయడం లేదని స్థానికులు అంటున్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో రీ ప్లాంటేషన్ చేయాలి. అయితే బీజేఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి వరకు సుమారు 53 మొక్కలు పూర్తిగా ఎండి పోయాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోగా, ఉన్న వాటి రక్షణకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

దూర విద్యను వినియోగించుకోండి



మల్లెపల్లిలో బోధిస్తున్న తెలంగాణ ప్రథం సంస్థ హెడ్ సుధాకర్

దోమ : గ్రామీణ ప్రాంత ప్రజలు దూర విద్య తరగతులను వినియోగించుకోవాలని తెలంగాణ ప్రథం సంస్థ హెడ్ సుధాకర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మల్లేపల్లిలో ప్రథం సంస్థ ఆధ్వర్యంలో సెకండ్ చాన్స్ తరగతులను సర్పంచ్ అంజిలయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాలలో అర్ధంతరంగా చదువు మానేసిన మహిళలు దూర విద్య తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 16 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఈ దూర విద్య తరగతులకు అర్హులన్నారు. వీరందరికీ మెరుగైన విద్యను అందించేందుకు ప్రథం సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరినీ ఉత్తీర్ణత సాధించే దిశగా ముందుకు సాగుతామన్నారు. ఈ విద్యలో ఇప్పటికే 23 మంది మహిళలు చేరారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, సెకండ్ చాన్స్ పోగ్రాం కో ఆర్డినేటర్ నరేందర్, జిల్లా కోఆర్డినేటర్ వెంకటయ్య, మండల కో ఆర్డినేటర్ మురళి కృష్ణ, అంజిలయ్య, అనురాధ, హరికృష్ణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలు ఆధునిక దేవాలయాలు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: సీఎం కేసీఆర్ హయాంలో విద్యాలయాలు ఆధునిక దేవాలయాలుగా రూపాంతరం చెందాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవాన్ని స్థానిక వీరయ్య ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. రాష్ట్రం రాక ముందు సర్కారు బడులు పశువుల పాకలుగా ఉండేవని, నేడు ఆధునిక దేవాలయాలుగా విరాజిల్లుతున్నాయని అన్నారు. గురుకులాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. విదేశీ విద్యకు రూ. 20లక్షల సాయం, జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 10వేల గ్రంథాలయాలు, 1,600ల డిజిటల్ క్లాస్ రూమ్‌లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, సర్పంచ్ బి.శైలజ, ఎంఈఓ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

నోట్ బుక్స్ సైతం ఉచితం



చౌడాపూర్‌లో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ అందిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, స్థానిక నేతలు

- సర్కారు బడిలో మరో నూతన పథకం
- విద్యార్థులందరికీ అందజేత

కుల్కచర్ల: గ్రామీణ నిరుపేద విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరో నూతన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలతో పాటు ఉచితంగా నోట్‌బుక్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం ద్వారా నిరుపేద విద్యార్థులకు కొంత ఆర్థికభారం తగ్గడంతో పాటు వారి విద్యాభివృద్ధికి మరింత ప్రోత్సాహకరంగా నిలువనుంది.


మూడు విధాలుగా పంపిణీ

గ్రామాల్లో నోట్‌బుక్స్ కూడా కొనుక్కొలేని విద్యార్థులు ఉన్నారని, కనుక అందరికీ ఉపయోగపడే విధంగా నోట్‌బుక్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వం వీటిని మూడు విధాలుగా పంపిణీ చేయాలని అన్ని ఏర్పాట్లు చేసింది. 1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి 4 వర్క్ బుక్స్ ఇవ్వనున్నారు. 5వ, 6వ, 7వ తరగతి విద్యార్థులకు ఆరు నోట్‌బుక్స్, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి 14 నోట్‌బుక్స్ పంపిణీ చేయనున్నారు. దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విద్యాదినోత్సవం రోజు నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా జులై మొదటివారం నుంచి ప్రతీ విద్యార్థికి ఉచితంగా అందేలా చర్యలు చేపడుతున్నారు.

కుల్కచర్ల, చౌడాపూర్‌లో..

కుల్కచర్ల మండలంలో 67 పాఠశాలలు ఉండగా, చౌడాపూర్ మండలంలో 47 పాఠశాలలు ఉన్నాయి. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం వల్ల కుల్కచర్లలో 5,396 మంది విద్యార్థులకు, చౌడాపూర్ మండలంలో 2,888 మంది విద్యార్థులకు మేలుచేకూరనున్నది. రెండు మండలాలలో ప్రస్తుతం మొదటి విడతలో భాగంగా 6,250 నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు అందించారు. ఇంతకుపూర్వం వసతిగృహాలలో మాత్రమే విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తుండగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సైతం నోట్‌బుక్స్ పంపిణీ చేస్తుండటం పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



పాఠ్యపుస్తకాలతో పాటుగా నోట్‌బుక్స్ కూడా ఉచితంగా అందించడం సంతోషంగా ఉంది. నోట్‌బుక్స్ ఇవ్వడం వల్ల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తప్పింది. టెన్త్‌కు 14నోట్‌బుక్స్ ఇవ్వడం మంచిది. అన్ని సబ్జెక్టులకు సరిపోతాయి. – మహేశ్, మరికల్, టెన్త్ విద్యార్థి

విద్యార్థులకు మేలు



నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ ఇవ్వడం మంచి కార్యక్రమం. ఎంతోమంది విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బంది తొలగనుంది. బయట మార్కెట్‌లో నోట్‌బుక్స్ తీసుకోవాలంటే వేల రూపాయల ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం అటువంటి ఉండదు.

– హబీబ్ అహ్మద్, ఎంఈఓ కుల్కచర్ల

డిగ్రీ కళాశాల మంజూరు చేయండి

సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ

పరిగి: ఆర్థిక స్థోమత లేని బీసీ విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని వారిని దృష్టిలో ఉంచుకుని బీసీ గురుకుల డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యతో కలిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిగి నియోజకవర్గంలో అత్యధికంగా బీసీ విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేనందున విద్యకు ఎంతో మంది దూరమవుతున్నారన్నారు. సుదూర ప్రాంతాల్లో చదివేందుకు వీలుకాకపోవడంతో మధ్యలోనే చదువు మానేస్తున్నారని సూచించారు. బీసీలు ఎక్కువగా ఉన్న పరిగి నియోజకవర్గంలో బీసీ గురుకుల డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య